# తీములూ - తిమింగళాలు

ఆ స్కూలు ప్రధాన ద్వారాల దగ్గర మొదలుకొని నలువైపులా చుట్టూరా కొన్ని పదుల సంఖ్యలో పోలీసులు కాపలా కాస్తున్నారు. జిల్లా కేంద్రంలో ఆస్కూలు వుంది. చతురస్రాకారంలో వున్న స్కూల్ కాంపౌండ్‌వాలుని అనుకొని తరగతిగదులు వున్నాయి. వాటి మధ్య పిల్లలు ఆడుకొనేందుకు వీలుగా మైదానంలాంటి ఖాళీ స్థలం వుంది. ఆస్థలం నడుమన నాలుగు సింహాలమధ్యలో పాతిన ఇనప జెండాకర్ర - జెండాలేకుండా బోడిగా నిల్చొని వుంది. సెలవేమో అక్కడ పిల్లలు ఆడుకోవడం లేదు కాని పెద్ద పెద్ద షామియానాలు ఆస్థలాన్ని ఆక్రమించుకున్నాయి.

స్కూలుగేటు గోడ దగ్గర ఓపక్కకి నేలమీద కూర్చున్న ముసలితల్లి నెత్తిమీది ఎండను పట్టించుకోకుండా కుళ్ళి కుళ్ళి ఏడుస్తోంది. ఆమె పక్కన ఓ పడుచుపిల్ల రెండేళ్ళ పసివాణ్ని ఎత్తుకొని నిలబడి వుంది. మధ్య మధ్యలో ఆపిల్ల ఏమో అంటున్నా ఆ ముసల్ది చలించకుండా కూచున్న దగ్గర్నుండి లేవకుండా వుంది. మాటిమాటికి ఓ ఏడేళ్ళ కుర్రాడు స్కూల్లోకివెళ్ళి గేటుదగ్గరకి వచ్చి అటూ ఇటూ తిరుగుతున్నాడు.

వంద కిలోమీటర్ల దూరం నుండి వురుకుల పరుగులతో వచ్చిన గోవిందమ్మ స్కూలు సమీపించేసరికి నేలకి కాళ్ళు అంటేసినట్టు నెమ్మదించింది. బలవంతంగా అడుగుల్ని వేస్తూ వుంటే గేటుకాడి ముసలితల్లి ఆమెను ఆపేసింది. గోవిందమ్మకు ముసల్దలా కుళ్ళి కుళ్ళి ఏడుస్తూ రాగాలు తీయడం ఎక్కడో కలుక్కుమంది. అందుకే కాళ్ళు నిలిచిపోయాయి. కళ్ళు అటే చూస్తున్నాయి. చెవులు ఎంత సారించినా ఆముసల్దాని గొంతు అందడం లేదు. అందకుండా షామియానాల కర్రలకీ గోడలకీ కట్టిన మైకులు హోరెత్తుతున్నాయి.

ఏడేళ్ళ కుర్రాడు స్కూల్లోంచి మళ్ళీ గేటు గోడ దగ్గరకు వచ్చాడు. తనతో వచ్చిన నడివయసు మనిషికి ఏడుస్తున్న ముసలిదాన్ని చూపిస్తున్నాడు. ఏదో చెపుతూ వున్నాడు. ముసలిదాని చెయ్యి

పట్టుకు లాగుతున్నాడు. ముసలిదాని పక్కన నిలబడ్డ పడుచుపిల్ల చంకలోని పిల్లాణ్నిదించి, ముసలిదాన్ని రెక్కపట్టుకు ఎత్తుతోంది. నడివయసాయన దగ్గరకొచ్చి ముసలిదాన్ని బలవంతంగా ఎత్తి నిలబెట్ట బోయాడు. ముసల్ది దుఃఖంతో మరింత రోదిస్తూ ఈంగ్రబడుతోంది. నడివయసాయన కేకలు వేస్తున్నాడు.

గోవిందమ్మకే కాదు ఆ దృశ్యం చూస్తున్న ఎవరికీ ఏమీ వినిపిస్తున్నట్టు లేదు. మైకులో పాటలేవో ఆగకుండావున్నాయి. పాటపాటకీ మధ్య ఒక్క క్షణం విరామంలో ఏదో చావుకేక చుట్టుకున్నట్టు ముసల్దాని దుఃఖం అందర్నీ చుట్టు ముడుతోంది. ఇదంతా మామూలే అన్నట్టు అప్పటిదాకా గమనించి వూరుకున్న నలుగురు పోలీసులు కొంత వ్యవధిచ్చి వచ్చి ముసలిదాన్ని లోపలకు పొమ్మనట్టు లాఠీకర్రతో తోవచూపుతున్నారు. ముసల్దిలేచి నిలబడి మళ్ళీ కూర్చుంది. ఓ పోలీసు నాలుకనివరగరుస్తూ 'వెళ్తావా వెళ్ళవా?' అన్నట్టు లాఠీతో తాటిస్తున్నాడు. లేదంటే బయటకు పొమ్మంటున్నాడు. అక్కడ మాత్రం వుండొద్దని చెపుతున్నాడు. మరో పోలీసు మాత్రం ఇందాకటతన్ని వారించి ముసలిదాన్ని రెక్క పట్టుకున్నాడు. నడివయసాయన సాయంగా మరో రెక్కపట్టుకున్నాడు. మొత్తానికి ముసలిదాన్ని స్కూల్లోకి షామియానాల క్రిందికి నడిపించారు. వెనకాలే పసివాణ్ని ఎత్తుకొని పడుచుది, ఆమె కొంగు పట్టుకొని అనుసరించాడు ఆ ఏడేళ్ళ కుర్రాడు.

గోవిందమ్మ తనకు తెలీకుండానే వాళ్ళ వెనకాలే నడిచింది. నడుస్తూ చుట్టూ చూస్తోంది. చాలామంది డ్యూటీ దుస్తులు కాకుండా మామూలు దుస్తులతో హాజరయివున్నారు. వస్తూ పోతూవున్నారు. కొందర్ని ఆమె గుర్తుపట్టింది. ఆమె గుర్తుపట్టిన వాళ్ళందరూ ఆమెను గుర్తు పట్టారో లేదో తెలియదు. ఎవరూ పలుకరించనందున తనూ పలుకరించలేదు. ఒకరిద్దరు కళ్ళతో పలుకరింపుగా చూసి నవ్వారు. తనూ అలాగే నవ్వే ప్రయత్నం చేసింది.

"నీను తిన్నుగాక తిన్ను. నానేనాడో సచ్చిపోన్ను. నా ఆకలి ఎక్కడ్నుంచివొచ్చి బతికున్నాను... బువ్వపెట్టండని వస్తాది...?!"

ముసల్దాని కేకతో గోవిందమ్మ ఇటు తిరిగింది.

ముసల్ది అడ్డుగుండార కట్టి వుందేమో పైటతో ముఖం తుడుచుకొని రవికలేని ఒళ్ళంతా కప్పుకుంది.

"పోని తినకు, అరకు నోర్మూసుకొని వూరుకో..." నడివయసాయన కోప పడ బోయాడు.

"ఆసావు కూడు ఎవులు తింతార్రా..తుపూ.." తుపుక్కున వుమ్మింది ముసల్ది. ఆ వుమ్మెల్లి పరిచిన పరదాల మీద పడి ఇంకి పోలేదు.

"నీన్నీకు ఏటి సెప్పినానే? ఇంటికాడ బయలెల్లినవుడు ఏటి సెప్పినానో ఎరికుందా? ఎదనపెట్టుకో, మారు మాటాడకు. గండం గట్టెక్కి పోనీ.." నడివయసాయన ముసలిదాన్ని

సముదాయించి 'ఈ కుర్సీలోట కూకో..'' వేసివున్న కుర్చీని లాగి చూపించాడు.

''అబో... కుర్సీ.. మరెపుడి కెరికి లేదు? మావేం కుర్సీలకి ఆసపడిరానేదు. అవి మీక్కావాల. మాకేల? మాకిసాలమైన నేలుంది కాదా?! అయినా ఈడి కుక్కల కూడుకీ కుర్సీకి ఆసపడి ఎలిపోరాలేదెపుడు. నాకూడే కుక్కలు తినాల...'' ముసల్దాన్లో దుఃఖం పోయి క్రమక్రమంగా ఆవేశం చోటు చేసుకుంటోంది.

''మరొక్క నాలుగు గంటలు వోపిక పట్టు..'' నడివయసాయన ముసలిదానికి చేతులెత్తి ఒక్క క్షణం దండమెట్టి, అటూ ఇటూ చూసి సర్దుకున్నాడు. జనం రద్దీకి, గోలకి ఒకర్నొకరు పట్టించుకున్నట్టులేరు.

ముసల్ది అసహ్యంగా కుర్చీవొంక చూసి ముట్టుకుంటే మైలపడిపోయి నట్టు ఎడంగా జరిగింది.

ఇంతలో- ''భోజనం చెయ్యనివారు త్వరగా చేస్తే భోజన కార్యక్రమం ముగుస్తుంది, తర్వాత కార్యక్రమం మొదలవుతుంది, అది అయినాక దూరప్రాంతాల వాళ్ళు చేర్జీలకి డబ్బులు తీసుకొని ఇల్లకి పోవచ్చును.. గాన-చెయ్యని వాళ్ళు వెంటనే భోజనం టెంట్ల దగ్గరకు రావలసిందిగా కోరుతున్నాం'' అని మైకులో చెప్పారు.

'ఈడొక్క పూట బువ్వెట్టిస్తే మాం బతికిపోతాం, లేపోతే సచ్చిపోతాం గావాల, ఎలగమరి?!' ఎకసెక్కంగా మైక్కూ రిప్లై ఇచ్చింది ముసల్ది.

నడివయసాయన ముసలిదాని మాటల్ని పట్టించుకోకుండా ఆమెవెంటవున్న పడుచుదాన్తో ''నువ్వెళ్ళి తినమ్మా, మీయత్త తోటి ఏటి? ఎళ్ళు... బేగెళ్ళు..'' ఎదురుగా వెనక్కి చేసి వేసి వుంచిన షామియానాల వంక చూపించాడు.

ఆ పడుచుపిల్ల అవునని గాని లేదని గాని సమాధాన మివ్వలేదు. వెళ్తానని గాని వెళ్ళననిగాని తలకూడా ఆడించలేదు. చేతిపిల్లాడ్ని చంకమార్చి ఎత్తుకు అలాగే నిలబడింది. పసివాడు ఎండకో ఆకలికో చెంకన వుండక, చెంక దిగక ఏడుస్తున్నాడు. వాణ్ణి వోదార్చే ప్రయత్నం చేస్తోందా పిల్ల.

''ఆ ముసిలిదాని కంటే వొంటిన వూపిరి లేకపోయినా పొరుసమున్నాది దాంతోటి బతికేస్తాది, మనమూ ఒక పూట తినకపోతే సచ్చిపోముకాని పసోలు.. ఆగుంటల్నిసూడు. ఆసేతి గుంటడికి ఒక ముద్ద తినిపించు, తుటాయించి పోగల్దు..'' నడివయసాయన ఆమాటన్నాక, చేతిలో పిల్లాడ్ని చూసాక- ఒక్క క్షణం ఆలోచనలో పండిందేమో ఆగి, పిల్లాణ్ణి ఎత్తుకు భోజనాల షామియానాల కిందికి నడిచింది పడుచుపిల్ల.

ముసల్ది అడ్డుచెప్పలేదు. నెత్తిన చేతులువేసుకు నేల్లోకి చూపులు గుచ్చుతూ నేలమీద కూర్చుంది.

''నువ్వెళ్ళరా... మీ పిన్ని ఎల్తందదో.. ఎళ్ళు...'' ఏడేళ్ళ కుర్రాణ్ణి నడివయసాయన పంపించి పరిగెత్తించాడు.

ఏదో గుర్తుకొచ్చిన దాన్లా ముసల్ది చుట్టూ చూసి, అలాగే నెత్తిమీదకి చూసి "ఈల పందిరికింద నానుకూకోడమేటి?, ఛ్.." అని పైకే గోణుక్కుంటూ తప్పు చేసిన దాన్లా షామియానాల కింద నుండి లేచి వెళ్ళి ఎడంగా ఎండలో కూర్చుంది.

నడివయసాయన చేతిగడియారం వంక చూసుకొని, కుర్చీ లాక్కొని కూర్చున్నాడు. చేతివేళ్ళతో కంటిరెప్పల్ని మూస్తూ అరచేతిలో నుదురుపెట్టి ఆలోచిస్తున్నాడో కునుకుతీస్తున్నాడో తెలీడం లేదు.

గోవిందమ్మ గుంపులో తప్పిపోయినదాన్లా అక్కడే అలాగే నిల్చుండి పోయింది. తనువొచ్చిన పని మనసుని కెలుకుతూనే వుంది. భోజనాల సమయంకదా కాసేపు ఆగుదామని అనుకుంది. తెలిసిన వారెవరన్నా తారస పడతారేమోనని చూస్తూ ఓకుర్చీ లాక్కొని కూర్చుంది. ఎందుకో తెలీకుండా గోవిందమ్మ చూపులు ముసలిదాన్ని వెంటాడుతున్నాయి.

భోజనాల సమయమనేమో ఆపినమైకులు భోజనాలు కాకుండానే మళ్ళీ చిన్నగా మొదలయ్యాయి. మధ్యమధ్యలో ఎవరెవర్నో మైకులో పిలుస్తున్నారు. ఎక్కడ హాజరు కావాలో ఎవర్ని కలియాలో చెపుతున్నారు. వాళ్ళ వాళ్ళ పేర్లూ వూరిపేర్లూ చెపుతుంటే గోవిందమ్మకు అలకిడి అలికిడిగానే కాదు, అలజడి అలజడిగా వుంది. గుండెలో గాబరాగా అవుతోంది.

కరెంటు పాదుపో పోయిందో తెలీదు కాని మైకులో పాటలు ఆగిపోయాయి. వుడుకుడుకు అన్నాలు తిన్నవాళ్ళు అలసటగా అటూ ఇటూ తిరుగుతున్నారు. ఎండకి షామియానాలు దాటి బయటకు వెళ్ళలేక చాలా మంది కుర్చీల్లో కూలబడ్డారు. కొందరు చుట్టాబీడి వెలిగించుకు దమ్ము పీకుతున్నారు. మరికొందరు చిన్నగా కుర్చీల్లోనే కునుకుతీస్తూ వేడిమికి చెమట పట్టి ఉస్సురుస్సురుమంటున్నారు. ఇంకొందరు ఆడవాళ్ళు గుంపులుగా చేరి గుసగుసలాడుతున్నారు, కళ్ళ నీళ్ళు తిప్పుకుంటున్నారు. శోకాలు తీస్తున్నారు. శాపనార్థాలు పెడుతున్నారు. వేళ్ళు విరుస్తున్నారు. వాళ్ళ వాళ్ళ మగవాళ్ళో పెద్దవాళ్ళో అందర్నీ కంట్రోలు చెయ్యలేక చిరాకు పడుతున్నారు. ఎలాగో చావండి అంటున్నారు.. అలా అని వూరుకొని వుండ లేకపోతున్నారు.

చేతివేళ్ళు విరిచి తిట్టి శాపాలు పెడుతున్నప్పుడల్లా గోవిందమ్మ వులిక్కి వులిక్కి పడుతోంది. తననే ఎవరో అంటున్నట్టు... ఇప్పటికే ఆశాపం తగిలినట్టు... రేపింకా తగలనున్నట్టు బేజారు పడుతోందామె. కూర్చున్న చోట కూర్చోలేకపోయింది, వచ్చిన పనిచేసుకు వెళిపోదామని కూర్చున్న చోటునుండి లేచి నడిచింది.

... అంతా మట్టిని నమ్మి మట్టి గొట్టుకు పోయిన మనుషులు. మాసిపోయిన దుస్తులతో కొప్పులతో తెగిన చెప్పులతో చెప్పులులేని కాళ్ళతో పదికాదు వందేళ్ళకిందకి పోయిన మనుషులు. ఇలాంటి మనుషులుంటారని కొద్దిమంది మనుషులకే తెలియని మనుషులు... గోవిందమ్మ ఆ కారణంగానో ఇంకేకారణంతోనో ఆవాతావరణంలో ఇమడలేకపోతోంది. అటూ ఇటూ తిరుగుతున్నట్టుగా వుంది గాని వున్న చోటుకే వచ్చింది. కరెంటుతో మైకొచ్చింది.

ఏవేవో పేర్లు... పేర్లని పోలిన పేర్లు... కాని వాళ్ళ వాళ్ళ వునికిని గుర్తించక తప్పని వూర్లు... వూర్లని పోలిన వూర్లు.... మూకిన పల్లి, బొడ్డపాడు, చిన్న నీలావతి, రట్టి భేతాళ పురం... ఇంకా పిలుస్తూనేవున్నారు. కౌన్సిలింగ్‌కు హాజరు కమ్మని వారి వారి బంధువులను మిత్రులను సానుభూతి పరులను పిలుస్తూనేవున్నారు. మొత్తం 'ఉద్దానాన్నే' తలుస్తూవున్నారు.

గోవిందమ్మ గుండె గుభిల్లుమంది. తెలీకుండానే కాళ్ళు నేలలోకి లాగేస్తున్నట్టు కుర్చీలో కూలబడింది. ఒళ్లు వణకడం తనకే తెలుస్తోంది. ఎవరైనా చూస్తారేమోనని భయంభయంగా వుంది. అయినా వచ్చిన పని కోసం కలిసేపోవాలనుకుంది. కాని గతంలో కలసిన అనుభవాలు వెనక్కిలాగుతున్నాయి. ఏమైనా ఈదఫా నిలదియ్యాలనీ అనుకుంది. అవకాశ మిస్తాడో ఇవ్వడో అనుమానించింది. అందరూ... డిపార్టుమెంటంతా వుంటుది గనుక ఇదే అనువు అనుకుంది.

"అమ్మా... అమ్మా... గోవిందమ్మగారూ..." పేరుపెట్టి పిలిచేసరికి వులిక్కి పడి చూసింది. ఎదురుగా సివిల్ డ్రస్‌లో వున్నవాళ్ళని పోల్చుకోగలిగింది. వాళ్ళు తనని పోల్చారని ఆమె గ్రహించింది. లేచి నిల్చొంది.

గోవిందమ్మ చుట్టూ నిల్చున్న ముగ్గురూ 'కూర్చోండి.. కూర్చోండి' అన్నారు. అందులో తలపండిన ఒకడు "తమరేమిటమ్మా ఈవేళప్పుడు?... అదీ ఇక్కడ..." వూహకందని ఆశ్చర్యంతో అడిగాడు

'ఈవిడెవర్రా..?..'' అందులో ఒకడు అతినెమ్మదిగా అడుగుతున్నట్టు పక్కవాణ్ని అడిగినా ఆమాట గోవిందమ్మకు వినిపించింది.

"..తెలీదా మన యస్సైగారి భార్య, గోవిందమ్మగారు..." అని గోవిందమ్మ ముఖం చూస్తూ '...ప్చ్... భగవంతుడు అంతేనమ్మా, మంచివాళ్ళని బూమ్మీద మననీయడు. లేపోతే మీ బొట్టు చెరిపేస్తాడా?' అని విచారంగా ఒక్క క్షణమాగి.. "అవునమ్మా అబ్బాయి గుమలచ్చిపురంలోనట గదా?!... తండ్రి వుద్యోగం... తండ్రి ఆస్తితో సమానం! ఎలగొదిలెస్తాడు? చదువుంది కదా, రేపయినా మంచి పొజిసన్లోకొస్తాడు" నమ్మకంగా చెప్పాడు ముగ్గుర్లో ముదరోడు.

గోవిందమ్మ ఎందుకో వాళ్ళ ముఖాల్లోకి చూడలేకపోయింది.

"ఏ యస్సై గార్రా?" ఇందాకటతను అడుగుతున్నాడు.

"పాలబుగ్గ యస్సై వెంకట్రావు గోర్రా....' ఇంకో అతను చెప్పడంతోనే అంతా అర్థమయిపోయినట్టు 'ఆఁ...' అని అంతా తెలిసినట్టు దీర్ఘం తీసాడు ప్రశ్నవేసిన వాడు. అంతటితో ఆగక, 'నాకేల తెలీదు?' అని ప్రశ్నించి "రమేషు గదా ఈలబ్బాయి, కానిస్టేబులు. నాకేనికి తెలీదు?" అన్నాడు మళ్ళీ, అనుమానం తీరిపోయినట్టు.

గోవిందమ్మ తలపైకెత్తి ఒకసారి చూసింది. ఆమె కళ్ళలోకి చూపు కలిపిన ముదరోడు "ఏమమ్మా ఏదైనా పనా?" అని గొంతు తగ్గించి రహస్యంలా అడిగాడు.

అవునన్నట్టు తలాడిస్తూ "పెద్దాయన్ని కలవాలని..." చెప్పింది గోవిందమ్మ. వివరాలు తెలుసుకోవాలని 'ఏటమ్మా' అన్న ముదరోడు గోవిందమ్మ కళ్ళలోకి చూసి ఏమనుకున్నాడో మరి అడగలేదు. కాని 'కౌన్సిలింగు' అవుతోందన్నాడు. జిల్లా మూలమూలలనుండీ జనాలొచ్చారట. లోపటున్నోళ్ళని వాళ్ళ వాళ్ళ తలిదండ్రులో అన్నదమ్ములో అత్తమామలో బంధువులెవరయినా గాని... మిత్రులేగాని.. ఆలకి వత్తాసుపలికి... వాలంటే నమ్మకమున్నోలెవలయినా సరే వచ్చి మా వోలు బయటికెలిపొస్తారంటే-చెపితే-ఆలకి పోలీసులూ డిపార్టుమెంటంతా ఆదరించి రమ్మంటుందట. స్వాగతం పలుకుతుందట. గవర్నమెంటు పాలసీ మారిందట. జనజీవన స్రవంతిలో కలిసిపోవచ్చునట. కేసులు కొన్నాలు వుంచినా జైలుండదట. ఆకేసులూ నడవడి చూసి కొట్టేస్తారట. పైగా పునరావాసం కింద లక్షలు లక్షలు ఇస్తారట. వ్యాపారాలో యవ్వారాలో ఏదో బతుకు తెరువుకి చేసుకోవచ్చట. తంతే బూరిలగంపలో పడినట్టేనట.

ఎవరో పిలిచి దండమెట్టడంతో ముదరోడు ఆగిపోయాడు. దండం అందుకున్నాక చెప్పాడు. తను కానిస్టేబులుగా చేసి 'ఏడ్డు' అయినాడట. అందుకే ఆ లంజికొడుకు దండమెట్టినాడట. వాడికేదో పనివుండే వుంటుదట. లేపోతే పోలీసోన్ని పిలిచి దండం పెట్టినోళ్ళెవరూ బూమ్మీద పుట్టలేదట. పుట్టరట.

"మనకి టైమవుతున్నట్టు గుంది..." ఏడ్డుగారికి ఎక్కడ కోపం వస్తుందోనని అతివినయంగా అన్నాడు ఇందాకటి అనుమానపోడు.

ముదరోడు కళ్ళెర్ర జేస్తూచూసి "నిజమేన్రా మనకెప్పుడో టయమయిపోయింది టయిమయిపోబట్టే పోలీసు డిపార్ట్‌మెంటులో కొచ్చినామా మరేటే?! మనం చస్తే లచ్చలు. ఆలు బయటకొస్తే బతికొస్తే లచ్చలు.. మా బాగుంది..." అంటూ తనమాటకి తనే నవ్వుకున్నాడు.

"ఎల్తాం తల్లీ' ముదరోడు దండమెట్టి కదలబోయి ఆగి "సాయంత్రం ఈ జెంజాటకం వదిలిపోయిన తర్వాత కలుతల్లీ. నీను చెప్తుతానొక మాట..." అని గోవిందమ్మ విశ్వాసమయిన చూపుని తీసుకొని వెళ్ళాడు. అతని వెంట మిగతా ఇద్దరూ అనుసరించారు.

వెళ్తున్న ముగ్గురూ ఆగి, కుర్చీలోవున్న నడివయసాయన్ని నిద్ర లేపి "పత్తింగుందా? యస్పీ దొర బాబునడిగి దూది మంచం ఏయించీదే?" అంటూ ఎకసెక్కాలాడి నవ్వుకున్నారు. నడివయసాయన కళ్ళపులుముకుంటూ లేచి నవ్వుని శృతికలిపాడు.

"అవునోయ్... మైక్కుగొంతు పట్టేసినట్టు రట్టో.. రట్టి భేతాళపురమో అని సెవికోసిన మేకలాగ అరుస్తుంటే పలకరేటి? కూకున్న గుద్ద గుర్రుపెడతాదట. అలాగ కూకిందీ సరికి గుర్రుగుర్రున టోకుర్లొచ్చేస్తన్నాయి నీకు. పోలీసోలంటే గొప్ప అనుకువయిపోయిందోయ్..." ముదరోడు ముఖం ముడ్డిలాగెట్టుకున్నాడు.

నడివయసోడు చేతులు నులుముకుంటూ "అంత మాటనీకండి బాబు... మీరు సెప్పిన పనిమీద వారం పొద్దయి తిరుగుతున్నాను. నాల్రోజులయిన కంటిమీద కునుకులేదు.

ఏలంజకొడుకొచ్చి మీద పడిపోతాడేనని రాత్రులు నిద్రపట్టీదే కాదు...'' సంజాయిషీని ఇచ్చుకున్నాడు.

''పొద్దున్న రాగానే అడ్రాసటి రాపించినావా, మరి ఇప్పుడాలని తీసుకొని ఎల్లికలువు. ఏమి పెద్ద దొర స్వీటిల పొద్దున్న చెప్పలేదా? నీకు బొట్టెట్టి మళ్ళా చెప్పాలా? అందరయి పోతన్నారు. బీడు తగ్గింది. ఇలాటప్పుడే తీసుకెళ్ళు. సిక్రెటుగా ఆల తల్లీ పిల్లలు ఏదయినా చెప్పకోవచ్చు...'' ముదరోడు నడిపయసాయన ఎక్కడి కెల్లాలో దారిచూపించాడు. ''ఆ ముసిల్ది భేతాళుడులాగ ఒగ్గదు. దాన్నుంచే ఆలపూరు రట్టికి రట్టి భేతాళపురమని పేరొచ్చినట్టుగుంది'' అని నవ్వి ''ఆ ముసిలి లంజికూతుర్ని తీసికెళ్ళినప్పుడు జాగర్త. మాట తూగిపోద్ది. దాన్ని మాట్లాడొద్దను. దాని రెండో కోడలు వచ్చిందిగదా ఆపిల్లే ఏదో మాట్లాడుతాది, ఎలగా దాని పెనిమిటి కత గురించే కదా వచ్చింది'. అంటూ జాగ్రత్తలు చెప్పిన ముదరోడు తనవెంటొచ్చిన వాళ్ళతో ఆలస్యమయిపోయిందేమో పరుగుతీస్తూ వెళ్ళాడు.

గోవిందమ్మ ఇప్పుడు తనొచ్చిన పని  మరిచి పోయినట్టుంది. యుద్ధాలూ... చావులూ.... జైళ్ళూ... పోలీసులూ... మనుషులూ... వీటి చుట్టూరానే తిరుగుతోంది. వాట్లోంచి బయట పడడమంటే మళ్ళీ ముసలదాని వెంటే చూపులు చుడుతున్నాయి.

సుర్రున కాల్తున్న ఎండలో ముసల్ది చలికి ముద్దయిపోయినట్టు చెమటకు తడిచిపోయింది. కాని కూర్చున్న చోటునండి పవనం పట్టేసినట్టు అరంగుళ మైనా కదల్లేదు. ముసలిదాని కోడలు పసివాణ్ని ఎత్తుకు వెనకాలే నిలబడివుంది. ఏడేళ్ళ కుర్రాడు ఆమె కొంగును అంటిపెట్టుకొనే వున్నాడు. అటూ ఇటూ తిరుగుతున్న ఎరిగిన వాళ్ళు పలుకరించినా ముసల్ది పలకడంలేదు. కోడలు మాత్రం ఒకటీ అరా అయినా మాట్లాడుతోంది.

నడివయసాయన ఏదో ఆలోచించడానికేమో కొద్దిసమయం తీసుకొని ముసల్దాని ముందరికెళ్ళి నిలుచున్నాడు.

''మనం ఇల్లకి పోమా? రేతిరికీ ఇక్కడే వుండిపోతామేటి?'' అని నడివయసోడు ఆగిచూసాడు. ముసల్ది దించిన తలెత్తలేదు. అతను పడుచామెవంక చూస్తూ ''మీ అత్త ఇక్కడే వుండని... మనమెల్లి పోలీసు పెద్దల్ని కలిసొద్దాం. ఆలోకమాటన్నా ఓర్సుకో. ఆలకేల కంటికగ్గసంగా మాట్లాడ్తం?...'' అని ముందుజాగ్రత్తగా ఓమాటని 'పద' అన్నాడు. అతని వెనకాతలే పడుచామె పసివాణ్ని ఎత్తుకువెళ్ళింది. వెళ్తూ వెళ్తూ ఆ ఏడేళ్ళ కుర్రోణ్ని 'నాయినమ్మ దగ్గిర కూకో, సిటంలో పారొత్తాను'' అని చెప్పివెళ్ళింది.

ఆ ఏడేళ్ళ కుర్రాడు కూకున్న ముసల్దాని రెండుముడుకుల మీద రెండు చేతులు వేసి ఆమెకళ్ళలోకి చూసి అలాగే ఒడిలో తలపెట్టుకు గొంతికూర్చున్నాడు. ముసల్ది చూపుడు, మధ్య వేళ్ళతో ఆపిల్లాడి జుట్టులో పేలు దేవుతున్నట్టు ఆప్యాయంగా తలనంతా తడిమింది. అలా తడుముతున్న కొద్దీ ఆమెకెంతో దుఃఖం కలిగినట్టుంది, కళ్ళలో నీళ్ళు తిప్పకుంది.

గోవిందమ్మ కన్నార్పకుండా చూస్తూనే వుంది.

ఎవతో మరోముసల్ది ఈముసలిదాన్ని చాలాసేపు పరీక్షగా చూసి ''మ...మనది రట్టికదమ్మా..ను..నువ్వు... ఓలె వరిపండు నువ్వా...?! నాను బొడ్డపాడు నీలాంబరం తమ్ముడు పెళ్ళాన్నే...'' అంటూ పక్కనే మట్టిలో కూర్చుండిపోయింది. ముసల్ది మనవడ్ని జోకొడుతూనే కళ్ళు తుడుచుకుంది. 'వరిపండు' అనగలిగింది. మరికొద్దిసేపటికి ''నువ్వుదేశమెల్లి ఎప్పుడొచ్చినావ్?'' అడిగింది.

పెద్దకొడుకికి కలకత్తాలో పనట. గోనె మిల్లులో పనిచేస్తాడట. ఆల అయ్యాల కానుండి అదేనట. వూరికే బొడ్డపాడు సొంతవూరట గాని ఎప్పుడూ వున్నదేది లేదట. ఆఖరికొడుకు అండమానెలిపోయి అయిదేళ్ళకి వచ్చినాడట. ఇన్నాళకి వచ్చినాను గదా ఒకపాలి వూరుసూ సూసొస్తానని వచ్చినాడట. వూర్లదిగినాడట. బంధువులూ బాగార్ల ఇళ్లల్ల రెండ్రోజులున్నాడట. మూడో రోజుకి నచ్చలైటని పోలీసులు ఎంటబెట్టినారట. తప్పించుకుపోనాడంతారట గాని అసలు వున్నాడో లేదో తెలీదట. పోలీసులు లేదు లోపలే మీవోడు వున్నాడని సెప్పినారట. అందుకని ఇదిగో ఇలావచ్చిందట.

అవన్నీ చెప్పి అవతలి ముసల్ది ఏడిస్తే, ఈ ముసల్ది 'రామేశ్వరం పోయినా సెనీశ్వరం ఒగ్గలేదే నీకు' అని తనూ ఏడ్చి మళ్ళీ ఆ ముసలిదాన్ని ఓదార్చింది.

'మనవడా?' అని ఆడిగింది అవతలి ముసిల్ది.

''... అవునమ్మా...ఈడు నాకొడుక్కొడుకు. గానీ నా క్కొడుకయిపోనాడు. ఆలయ్యా పోతూ పోతూ ఆలమ్మ కడుపుల ఈణ్ని పడేసిపోనాడు. ఆడు పోయి ఎన్నాలో ఈడుపుట్టి అన్నాలు. ఈడు ఇద్దరమ్మల కడుపు కొట్టీకుండ ఇలగున్నాడు....'' అని ఆ ఏడేళ్ళపిల్లాణ్ని పసిపిల్లాడిని చేసి మరింత గుండెలకు దగ్గరగా తీసుకుంది ముసల్ది. ఆమె చెపుతుంటే గొంతు దుఃఖంతో మూసుకుపోయి..... మనసు పచ్చిపుండయినట్టు దాన్ని ముట్టుకుంటే సీము కారినట్టు కళ్ళనీళ్ళు టపటప రాలాయి.

గోవిందమ్మ ఆభారం కొంత మోస్తున్నట్టు వుమ్మి గుటకలు మింగింది. అప్పటికే సూర్యుడు నెత్తి దిగిపోయాడు. ఎండవాలింది. ఆకాశం మబ్బులు కమ్మింది. మేఘాలు నల్లగా గుడగుడమంటున్నాయి. గాలి తిరిగింది. షామియానాలు గాలికి వూగి అంతవరకూ కట్టిన తాళ్ళని తెంపేసాయి. పాతిన ఇనుపముక్కల్ని వూడబెరికాయి. ఏర్పాట్లు చూసే మనుషులు అటూ ఇటూ పరుగులు తీసారు. ఫలితం లేదు. గాలి ఎత్తి పోస్తోంది. భోజనాల దగ్గర షామియానాలు అప్పటికే కుప్పకూలిపోయాయి.

తలపైకెత్తిన గోవిందమ్మ చుట్టు పక్కల చూసింది. గాలితో లేచిన షామియాలు నిలిపికట్టిన కర్రల్ని లేపేసాయి. అవి పట్టుకున్న వాళ్ళు వాటిని ఆపలేక అపసోపాలు పడుతున్నారు. కూలిపోతుందని దానికింద వున్నవాళ్ళు అటూ ఇటూ తప్పుకుంటున్నారు. గోవిందమ్మ కూడా

పోమియానాల కింద నుండి ముసలమ్మ వున్న వేపు వచ్చినిలబడింది. ముసల్ది దేన్ని పట్టించుకున్నట్టులేదు. గోవిందమ్మ ఆవాతావరణానికి బెదురుతూవుంది. ముసల్దిమటుకు అదరక బెదరక అలవాటు పడ్డట్టు వుండి తన కొడుకు కథని అవతలి ముసిలమ్మకు చెపుతోంది.

సరిగ్గా ఏడుస్సరేళ్ళ కిందట... అవి వుగాది రోజులు. అటు చలికాలం పోయి ఇటు ఎండాకాలం ముట్టె రోజులు. అప్పుడికి రొన్నాలయిన తెరిపిలేని వాన అవాల్టికే తెరిపిచ్చింది. ఆరాతిరి పిల్లాపాపలతో అందరం వున్న ఒక్క గుడిసెలో ఎచ్చఎచ్చగా పడుకొన్నాం. ఆల కడుపు మీద ఈలకాలు. ఈలకాలు మీద ఆలబుర్ర. ఆల బుర్ర మీద ఈలపిర్ర. తంగిడి పూసిన సెరువులాగ వుండీదిల్లు. అప్పుడికింకా రొండోవోడికి పెళ్ళికాలేదు. పెద్దొడికి పెళ్ళయి ఏడాదవుతాది. ఏడాది తిరక్కుండా కడుప్పుండిందిలే... అయితే అలాపింటిరోజు... ఆరోజు నీను కంటినిండ కునుకు తీసినాను.. అదే ఆకర్లే ఈ కంటికి...

తెలతెలవారతంది.

ఎవులో గెడకొట్టి పిలుస్తన్నారు. పెద్దోడు లెగిసెల్లి తలుపు తీసినాడు. ఎదురుగా ఇద్దరు పోలీసు బాబులు. అరిజెంటుగ బయల్దేరమన్నారు. 'ఏనికి బావ్' అన్లేదుగాని అలాగే సూసినాడు పెద్దోడు. పెద్దోడి పెళ్ళాంకి బయ్యిమేసింది గావాల నా ఎనకొచ్చిదాగుంది. 'అత్తా, మీ బాబుని ఎల్ల నివ్వద్ద'న్నట్టుగ సిక్కుతంది, బక్కరతంది. నాకర్థమయింది గాని నీనుసేసీది అందలేట్లేదు. 'ఏటిపని సెప్పండి, పొద్దున్నే టేషనికి రమ్మంటె వత్తాడు' అన్నాను. ఆలు ఇనిపించుకోలే.

'పొద్దున్న దేనికి? ఆఫీసరవా? పొద్దున్న పదయితేగాని అరుగుదిగవా? ఇప్పుడు పనుంది అర్జెంటుగ బయల్దేరు..." మాట కటువు ఆలపళ్ళ బిగువూజూసి నాకొడుకు పంచిమీద బనీను ఏసుకొని, ఇంకేటంతారని ఒక్క సిటం ఆగినాడో లేదో ఆడిపెళ్ళాం 'ఓ' అని ఒకటే ఏడుపుతీసి రాగాలు తీసింది. ఆలొక్క గదుముగదిమి 'నీ మొగుడ్ని సంపేడంలేదు. సంపీడానికి ఇంతసేపు సియింటిమందు నిలబడక్కర్లేదు... జీపు గోతిల దిగబడిపోయింది. తొయ్యాల.. అంతే- అన్చెప్పి కొడుకుని పాతికముప్పై యేళ్ళ కొడుకుని తీసికెళ్ళినారు.

మాపక్కింటి అప్పన్న, ఇద్దరు పిల్లలతండ్రి, ఆణ్నీ అదే పన్చెప్పి తీసికెళిపోయినారు. తెలతెలకవనే పోలీసులిద్దరూ గొఱ్ఱిల్ని తీసికెళ్ళినట్టు తీసికెళిపోయినారు.

తెల్లవారింది. సూరీడొచ్చినాడు గాని కొడుకులు రాలేదు. ఎండొచ్చి వాలింది గాని నా బిడ్డల సిటొచ్చి నా ముంగిట్ల పడలేదు.

ఇంటిపోలు కుటమాం మొత్తం వూరూ వాడా సెట్టూ పుట్టా ఎతికినాం. టేషన్‌కి బయలెల్తన్నాం కబురొచ్చింది. కల్లోలమైపోయింది. బూమి బద్దలైపోయింది. ఆకాశం పేలిపోయింది. నాశిరసు రాలిపోయింది.

పరిగెత్తినాం పిల్లా పిచ్చుకాతోటి. నెత్తి బాదుకొని. నోరు బాదుకొని. పరిగెట్టినాం. కడుపుదాయి కొడలు. నిండనెలలు. ఈడప్పుడు కడుపులున్నాడు. ఈడే. పడీలేచి పరిగెట్టింది. ఈడికెన్ని దెబ్బలు

తగిల్నాయో...? ఈలమ్మ కడుపుమీద బాదుకొని సోకం తీసింది. పాపం... లోపల ఈడెంత కంకటిల్లిపోయి నుంట్టుకుపోనాడో? అయ్యా... నువ్వు పుట్టకమేందే అన్ని బాధలూ అనుభగించీసినావురా కొడుకా... మనవాడా...

'ఎన్‌కౌంటర్' గోవిందమ్మ పెదాలు జపిస్తున్నట్టు వుచ్చరించాయి. ఆవుచ్చారణ తనకి తప్ప మరెవ్వరికీ వినిపించకపోయినా- కర్ణభేరిని డైనమెట్లు పేల్చుతున్న ధ్వనితో అంతరాల్ని చీల్చుతూ వినిపిస్తున్నాయి.

గోవిందమ్మ అక్కడ నిలబడలేక పక్కనే వున్న కుర్చీల్లో పిల్లలు ఆడుతుంటే వాళ్ళని లేపి కూర్చుండి పోయింది. కొంత సేపటికి మళ్ళీ ముసలిదాని మాటలు వద్దన్నా వచ్చి చెవిన పడుతున్నాయి.

... నా కొడుకుల వంటిన పంచలూ బనీన్లూ లేవు. పచ్చటి పేంట్లూ పచ్చటి చొక్కాలు. మునకాల కఱ్ఱ వుండాల్సిన సేతల టుపాకి... సదువురానోడి నెత్తి మీదా పక్కలోటా పొస్తకాలు... మొలతాడు వుండేసోట ఇనుప టుపాకీ గుళ్ళ గొలుసు... నుదురు మీద అమ్మోరు బొట్టు బదులు బొక్కపడి పారిన రకతం.. గుండెమీద వంటిమీద... ఎక్కడ కక్కడ ఒళ్ళంతా జల్లిడ పడినట్టుగ సిల్లులు...

సెవాల దరికి సేరనిచ్చినారు కాదు. అలే తీసికెలిపోయి ఆసపత్రిలోట ముక్క ముక్కలు కోస్సి కుట్టీసి గాని సంచిల సుట్టీసి ఇచ్చినారు. సెవం కొక తానమా? పానమా? అలాగ తీసికెళ్ళి ఈసేతులతోటి మట్టిల కలిపేనాం...

గోవిందమ్మ తలెత్తి చూసింది.

ముసల్ది కుళ్ళికుళ్ళి ఏడుస్తోంది. ఇంకో ముసల్ది కళ్ళ నీళ్ళు తిప్పుకుంటూనే ఓదార్చుతోంది. ఏడేళ్ళ పిల్లాడికి ఏం బోధ పడిందో... నాయినమ్మను చూసి దుఃఖమే ముంచుకొచ్చిందో వెక్కివెక్కి ఏడ్చాడు. ముసలాళ్ళిద్దరూ తమ ఏడుపుని ఆపి, పిల్లాణ్ని వూరడించారు.

మనసంతా చికాకుగావున్న గోవిందమ్మ మరల్చు కోవడానికి అక్కన్నుంచి లేచి మళ్ళీ షామియానాల కిందకు చేరింది. అక్కడ పడేసిన న్యూస్ పేపర్ని తీసి పట్టుకొని మళ్ళీ కాళ్ళు యధాస్థానంలోకి లాక్కొచ్చినట్టు వచ్చికూర్చుంది. ముసలిదాన్ని చూడాలనిపించింది. కాని చూడకూడదనుకొంది. పేపరు తెరచింది.

అది పాత పేపరని గోవిందమ్మ తారీఖుని చూడకుండానే పోల్చగలిగింది. కోపర్‌డాంగ్ అతి పెద్ద ఎన్‌కౌంటర్... అందుకు సంబంధించిన వార్తలు.. ఫోటోలు.... ఆమె కొన్ని నెలల వెనక్కి వెళ్ళింది. గుమలక్ష్మీపురంలో వున్న కొడుకు గురించి తల్లడిల్లి పోయింది. హైదరాబాద్ నుండి బృందమొచ్చి ఆపరేషను జరిగిందని తెలిసి చాలా వూరడిల్లి వూపిరి పీల్చుకుంది. రమేషు కూడా తను పేపర్లో చూసిందాక ఈ విషయం తెలీదన్నాడు. గోవిందమ్మయితే చాలా ఆశ్చర్యపోయింది.

అక్కన్నుంచి కొడుక్కి ట్రాన్స్ఫరయిపోతే బాగుణ్ను అనుకుంది గోవిందమ్మ. తలచుకోపడంతోనే వచ్చిన పని గుర్తుకు. వచ్చి, పేపర్ని మడిచి లేవబోయింది. లేవబోతూ ముసల్దాని పంక అనుకోకుండానే చూసింది.

ముసల్దాని కోడలు... పడుచుది ఎప్పుడు వచ్చిందో గాని అత్త భుజంమీద తలవాల్చి మొకాన్ని రుద్దిరుద్ది కళ్ళుకలక బారినట్టు ఏడుస్తోంది. పసివాడు మట్టిలో పార్లి వచ్చి తల్లిని చూసి ఏడుపందుకున్నాడు. నడివయసాయన ఏదో చెప్పబోయి ఏమి చెప్పాలో తెలియని వాడిలా అటూ ఇటూ తిరుగుతున్నాడు.

ఆ పడుచుపిల్ల కొద్ది సేపటికే కళ్ళు తుడుచుకొని పిల్లాణ్ని తీసి రొమ్మందించి నేలమీద కూర్చుండి పోయింది.

కొద్ది సేపు ఎవ్వరూ ఏమీ మాట్లాడుకోలేదు.

"ఈ పిల్ల ..." అవతలి ముసల్ది అడిగింది.

"... సెప్పినానుగానా?! నారొండో కోడలు. దీని మొగుడు లోపటికెళ్ళిపోయి మూడేలవుతాది గావాల. పెళ్ళయి నాలుగేమి అయిదేలు. ఇప్పుడు దీనికి రొండేలబిడ్డ సెంకనున్నాడు గదా?, నీ మొగుడెక్కడున్నాడో నీకు తెలుసును, అడ్ని వచ్చీమను. ఆడి ఆసూకి సెప్పు. అడ్రాసు సెప్పు. అంటే ఈగుంట నాకు తెల్దు అనుంటాది, మరినీకి కడుపు ఎక్కడిది? ఈ గుంటడు ఎవులికి పుట్నాడు. ఎవులే నీరంకు మొగుడు? ఆడివూరూపేరయినా సెప్పు... అవడగడానికే ఆలు పిలిపిచ్చినారా మరేటి?!..."

"ముసల్ది ఆవలిస్తే పేగులూ పక్కటెముకలూ లెక్కగట్టి టక్కున చేప్పేసి నట్టుగుంది" అనుకుంది గోవిందమ్మ. అంతకంటే ఆమెకోడలిని కన్నార్పకుండా చూసింది. ఆ తర్వాత ముసలిదాన్ని కోడల్ని మార్చి మార్చి చూసింది.

"నీ రొండో కొడుకున్నూ..?! అవతలి ముసల్ది అడిగింది.

"సేర్టిలకి బడ్డులిస్తన్నారు, తీసుకొని వత్తాను, అక్కడే కూకోండి..." అరుచుకుంటూ అటేటో వెళ్ళిపోయాడు నడివయసాయన.

"పెద్దోడి బతుకుల నిప్పులేకుండా పొగ బెట్టేసినారు. అలాటి దారుణ్యం మరి జరగకూడదని అన్నుల సంగపోల్లు మాయింటికొచ్చినారు. నిలబడ్డారు. ఆలు గట్టిగ నిలబడతోటికి మమ్మల్ని కమీసన్లుల్ని సేసేనారు. నచ్చలైట్లని సేసేనారు. ఆల గాముండం కప్పిపుచ్చుకోవడానికి లేనిపోనివి అంటగట్టేసినారు. ముద్దరలేస్సినారు. వూర్ల ఏది జరిగిన మాయింటికెలిపొచ్చినారు. కేసులు పెట్టినారు. అలగయితే పెద్దోడు కేసును ఎనక్కి లాగీసుకుంతామని సూసినారు. కేసుల మనమెక్కడ గెలుస్తాం గాని ఆలసేతిల మందీ మార్బలం డబ్బూ దస్కం వున్నాది. అయినా గుమ్మం దాటి

రాకుండా అల్లుకుల్లాలు పెట్నారు. దాంతోటి నా రొండోకొడుకు వూరే దాటిపోండు...''

ముసల్ది చెప్పి, పసివాణ్ని 'ఆలయ్యా గుద్దలెల్లి ఎక్కొచ్చినాడీడు'' అని మురిపెంతో ముద్దులాడింది. అవతలి ముసల్ది అప్పుడే తేరుకున్నట్లు లేదు.

''నా ఈక ఇంకేటి తెంపుతారని రాకపోదుము ఇక్కడికి. గాని ఈ కండల్ని కొండలు జెయ్యాల. నాల్రోజులు నెమ్మదిగెల్లాల. మన రోజులు రావాల. అంతదాక ఆలెందుకు కంట్ల కారం పోసుకోడమని, రమ్మంటే వచ్చినాం. సెప్పితే ఇన్నాం, వూకొట్టినాం... ఇవన్నీ మనకి తెల్దా? ఆలకితెల్దా? ఎవులికి తెల్దు...?'' ముసల్ది అదే ఆఖరిమాటన్నట్టుగా చెప్పి అక్కడ్నుంచి కదిలింది.

గోవిందమ్మెందుకో మోయలేని భారం నెత్తికెక్కినట్టు కదల్లేకపోయింది. అలాగే చాలా సేపు వుండిపోయింది. ఆమె మెదడు మొద్దు బారి పోయినట్టుగా వుంది. అందుకే వచ్చిన పనీ మర్చిపోయినట్టుగావుంది.

ఇందాకటి ముదరోడేమో ఎవరి చేతో కబురుపెడితే గోవిందమ్మ గబగబాలేచి పరుగులాంటి నడకతో వెళ్ళింది. ఎందుకో ఏమిటో ఏదీ తెలియకుండానే ఆమె గుండె దడదడలాడుతోంది. ఇదివరకు ఎన్నడూ లేని ఆందోళన ఆమెలో నిండుకొని ఆమెకే తెలియకుండా వణుకుతోంది.

ముదరోడు కాచుకు నిలబడ్డాడేమో గోవిందమ్మ రావడంతోటే ''ఆ గదిలోటున్నారు. ఎల్లమ్మా......'' అన్నాడు.

గోవిందమ్మ- చూపించిన గదివేపు నడుస్తోంది. ద్వారం దగ్గరికి వచ్చి ఒక్క క్షణం ఆగింది. ఏదో తెలీని భయం మొట్టమొదటి సారిగా ఆవహించింది. అవే ఖాకీబట్టలు తొడుకున్న వాణ్ని వెన్నంటి- పాతిక సంవత్సరాలు వెంటనడిచిందటే- ఆమెకే నమ్మశక్యంగా లేదు.

''....రాండి...రండమ్మా... వచ్చిలా కూర్చోండి...''

ఎలా వచ్చిందో, వచ్చి కుర్చీలో ఎలా కూలబడిందో గోవిందమ్మకే తెలీదు. ఆమె కళ్ళెత్తి చూడలేకపోతోంది. తలదించుకుంటే కాళ్ళూ చేతులు వణకడం తెలుస్తోంది, దాంతో వణుకుడు ఎక్కువవుతోంది కూడా. పైటను వీపు మీదనుండి మెడచుట్టూ తిప్పి మరింత గట్టిగా పట్టుకుంది.

''చెప్పండి...''

గోవిందమ్మ క్షణ కాలం కళ్ళెత్తి చూసిందేమో... నలుగురైదుగురు పెద్దవాళ్ళున్నారని గ్రహించింది. అందులో ఆనందరావున్నాడని ఆమె ఇట్టే తెలుసుకోగలిగింది. ఎందు కంటె తన భర్త యస్సైగా వున్న రోజుల్లో ఆనందరావు ఏ. యస్సైగా వున్నాడు. తన భర్త చనిపోయిన ఎన్‌కౌంటర్‌లోనూ, తర్వాత ఒకట్రెండు ఎన్‌కౌంటర్లలోనూ నక్సలైట్లని చంపి ప్రమోషన్ మీద ఏడాది తిరగకుండానే యస్సై అయినాడు. తర్వాత డిపార్ట్‌మెంటల్ పరీక్ష రాసి పాసయ్యాడన్నారు. సి.ఐ.ని దాటుకుంటూ ఇప్పుడు డియస్పీ అయినాడని కొడుకు చెప్పగావింది. ప్రస్తుతం ఇన్‌ఛార్జి యస్పీగా తనే బాధ్యతలు చూస్తున్నాడు.

"వచ్చిన పని చెప్పండి.."

వచ్చిన పని మర్చిపోయింది గోవిందమ్మ. గుర్తు తెచ్చుకొనే ప్రయత్నం చేస్తే తన కొడుకు మాటలే గుర్తొచ్చాయి. వాడు కళ్ళ నీళ్ళు తిప్పుకోవడం గుర్తుకొచ్చింది. "నేను..." అంటూ చెప్పబోతే- పక్క వాళ్ళెవరో అందుకొని మిగతాది పూర్తిచేసారు.

"... తెలుసు... మీరు తెలుసు... చెప్పండి ఎనీప్రాబ్లమ్....."

గోవిందమ్మకు మాటరాలే, పెకలిస్తే దగ్గొచ్చింది. సర్దుకొని కళ్ళుదించి "మా బాబు రమేషు ఏజెన్సీ ఏరియాలోనే వున్నాడు. మీకిది వరకే రెండుసార్లు కలిసి చెప్పాను. ప్లెయిన్ ఏరియాకు వెయ్యండి. వాడు... నాకున్నది ఒక్కడే..." కొద్దీగ తడబడ్డా చెప్పింది.

"ఏ ఏరియా అయితే ఏమండి? ఈ ఉద్యోగమే అలాంటిది. రిస్క్ తప్పదు. అయినా అదినా డిస్ట్రిక్టు కాదు..."

అలా అనేసరికి గోవిందమ్మకు ముందు ఏమీ బోధపడ్లేదు. తరువాత ఎవరెవరు ఎంతెంత ఖర్చు పెట్టి లంచాలు ఇచ్చి ఎలా వచ్చారో తెలుసును గనుక అనకూడని మాటలని కూడా ఆలోచించక అసందిగ్ధంగా తెలిసినవన్నీ అనేసింది. పరీక్షంగా మీరొక లంచగొండి అన్నట్టుగా వున్నాయా మాటలు.

"...ప్లీజ్... దయచేసి మీరలా మాట్లాడవద్దు. మీకిదివరకే రెండుసార్లు చెప్పాను. ఇప్పుడూ చెపుతున్నాను. మీనోటికి కంట్రోలు లేదు. లేకపోతే డిపార్ట్‌మెంటంతా ఏవేవో చెప్పి మీగౌరవాన్ని మా గౌరవాన్ని మంటగలుపుతున్నారు. మీవాడూ అంతే, నాన్సెన్స్... ఏదోదో వాగుతాడట...."

కొడుకుని అనేసరికి.... అదీ నలుగురి ముందూ అనేసరికి గోవిందమ్మ తట్టుకోలేకపోయింది.

"ఏమన్నాడు? వున్నమాటే అనుంటాడు"

"సరే, మీరిక వెళ్ళండి.."

వచ్చిన పని పూర్తిగా చెప్పక ముందే మొఖమ్మీదే వెళ్ళండి' అని అనడంతో గోవిందమ్మ చాలా అవమాన పడినట్టుగా భావించింది. అయినా దిగమింగుకొని... "మా వాడికి చదువులేదా? తెలివిలేదా? ఏమిటిలేదో చెప్పండి. కనీసం యస్సైగా నైనా వుండాల్సినవాడ్ని కానిస్టేబుల్‌గా...." ఇంకా పూర్తిచేయలేదు.

"... బొచ్చెడు మందికున్నాయి డిగ్రీలు. అందరూ యస్సైలూ సిఐలూ అయిపోతే ఇంకా కానిస్టేబుల్ ఎవడుంటాడు..."

నవ్విన నవ్వుకు మరిన్ని నవ్వులు వంతనవ్వేయి.

గోవిందమ్మకు ఎక్కభో భగ్గున మండింది. రోజంతా కాలుతున్న మనిషి పేలుతున్నట్టుగా కుర్చీలోంచి లేచి.... "ఏం నాకళ్ళ ముందు ఏయస్సైగా వున్న మీరు ఈ ఏడేళ్ళలో డియస్పీ అయిపోలేదా?" వుక్రోషం పట్టలేకపోతోంది. ఎవరో వచ్చి ఆమెను తీసుకెళ్ళ బోతే అడ్డుకుంది.

"... చూడమ్మా నీకు మాత్రం ఏమన్యాయం జరిగింది. మీ ఆయన పోతే వారాల్లోనే నాలుగు లక్షల ఎక్సుగ్రేసియా వచ్చింది. డెత్ కోటాలో మీవాడికి వుద్యోగమూ వచ్చింది. మీకంటె అదృష్టవంతు లెవరు?"

నవ్వులు గోవిందమ్మ చర్మాన్ని పొరలు పొరలుగా వలుస్తున్నాయి.

"మీ యావిడ నాలాగే ముండమోస్తే ఆ అదృష్టం మీకూ తెలుస్తుంది. మీ యావిడకీ వస్తుంది..."

ఎంత తబ్బిబ్బుతో అన్నా, తటాల్న ఆమాట అనేసరికి అంతా నిశ్శబ్దమైపోయింది. ఎవ్వరూ ఆమాటని వూహించినట్టులేరు.

క్షణకాలం తర్వాత, తేరుకున్నాక-

"గెటవుట్... ఐసే గెటవుట్..."

గదిగోడలు గింగురు మన్నా గోవిందమ్మ నిల్చున్న చోటునుండి కదలలేదు.

"అవునే.. మీ ఆయన తానేయస్సైనని భూమ్మీద నా అంతటోడు లేడని జీపులో కూర్చొని రజనీకాంత్ లాగ గన్నుని గిర్రున తిప్పి కాల్చాడు. జీపు గోతిల పడింది. గుండు కంఠం కింద దిగిపోయింది. అనుకోకుండా పోయినా అలావదిలీకుండా ఆ రట్టి లంజకొడుకుల్ని ఇద్దర్ని ఆవేకువేకువన తెచ్చి ఏస్సి, పక్కన పడీసి ఎన్‌కౌంటర్ అల్లీసి, నీ మొగుడిది వీరమరణమని జేకొట్టి ఎక్సుగ్రేసియాతెప్పించి, ఉద్యోగమిప్పించి..."

గోవిందమ్మకు మిగతా 'కత' వినిపించడం లేదు, మరేమీ కనిపించడంలేదు. తలతిప్పుతోంది. తూలుతూ అటాగే బయటకొచ్చింది. అడుగులెలా పడుతున్నాయో ఎటు పడుతున్నాయో తెలీడంలేదు. కళ్ళు చిట్లించుకు చూసింది. జనం వెళ్ళి పోతున్నారేమో గ్రౌండు పల్చబడింది. గాలి ఆపకుండా కొడుతోంది. చిన్న చినుకులు ప్రారంభమయ్యాయి. వెతికింది. షామియానాలు కుప్పకూలి వున్నాయి... వాటిపక్కనే ముసల్దాని కుటుంబం తుడిచిపెట్టేసి నట్టు మాయమయింది.

గోవిందమ్మ స్కూలు దాటింది, రోడ్డుదాటింది, బస్సెక్కి వంద కిలోమీటర్లు దాటింది... ఎన్ని దాటినా ముసల్దాని కుటుంబం ఆమెను వెంబడిస్తూనే వుంది... వెంటపడుతూనేవుంది.

★ ★ ★

*('ఎర' పేరుతో 'అరుణతార' లో అచ్చయింది)*
*ప్రచురణ : ఫిబ్రవరి-ఏప్రిల్ 2000 అరుణతార*
***రచనాకాలం : 10 డిసెంబరు 1999.***